బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్.. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్య పడుతుందని... ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వం లో హ్యాట్రిక్ సాధించడం ఖాయమని మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం సాయంత్రం షాపూర్‌నగర్‌లో ఎంజే ఫంక్షన్‌హాల్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. అందులో భాగంగానే అనేక ప్రాజెక్ట్‌లకు వేలాది కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈటల మాట్లాడుతూ.. తనకు గతంలో మంత్రిగా పని చేసిన అనుభవం ఉందని.. ఎంపీగా గెలిపిస్తే కుత్బుల్లాపూర్ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. బూత్‌స్థాయి నుంచి కార్యకర్తలను సమష్టిగా పనిచేసి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కమలం జెండాను ఎగురవేసేందుకు సహకరించాలని కోరారు

పోలింగ్ శాతం పెంపే లక్ష్యం

- లోక్‌సభ ఎన్నికల ఓటింగ్‌పై ఎన్నికల సంఘం చర్యలు
- తక్కువగా నమోదైన 715 పోలింగ్ కేంద్రాల్లో స్వీప్ కార్యక్రమాలు
- ఓటు ప్రాధాన్యత, వినియోగంపై ప్రజలకు అవగాహన
- విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులతో సంకల్ప పత్రాలు
- పోలింగ్ కేంద్రాల వద్ద వాక్ టు బూత్ కార్యక్రమాలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడానికి అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాల పరిధిలోని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. స్వీప్ జిల్లా నోడల్ అధికారి సాంబ శివరావుసహా అసెంబ్లీ నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 10 మంది స్వీప్ ఇన్‌చార్జ్‌లు ఓటు నమోదు, వినియోగంపై చర్యలు చేపట్టారు. జిల్లాలో ఎప్పటికప్పుడు తగిన కార్యాచరణతో స్వీప్ కార్యక్రమాల నిర్వహణ, సమన్వయం కోసం కలెక్టర్ చైర్మన్‌గా ఏడుగురితో కోర్ కమిటీని ఏర్పాటు చేశారు.

ఓటింగ్ శాతం తక్కువైన పోలింగ్ కేంద్రాలు 715

మేడ్చల్–మల్కాజిగిరి జిలాలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాలు 715 ఉన్నట్లుగా అధికార యంత్రాంగం గుర్తించింది. ఇందులో ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 207, కూకట్‌పల్లి 152, మల్కాజిగిరి 144, కుత్బుల్లాపూర్ 132, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 80 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా స్వీప్ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ పర్యటించి, ఓటు హక్కు వినియోగం, ప్రాధాన్యతపై స్థానిక ప్రజల్లో అవగాహన కల్పించేందుకు యత్నించారు. పోలింగ్ శాతం పెంచడానికి వివిధ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో మానవహారాలు ఏర్పాటు చేసి ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలోనే జిల్లావ్యాప్తంగా 1.76 లక్షల సంకల్పపత్రాలను విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు అందించి, సంతకాలు సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. అందులో భాగంగానే 1.23 లక్షలు సంకల్ప పత్రాలపై ఓటర్లతో సంతకాలు చేయించారు. ప్రతి కళాశాలలో ఇద్దరు విద్యార్థులను అంబాసిడర్లుగా నియమించి, సంకల్ప పత్రాలు, స్వీప్ కార్యక్రమాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్దకే ...

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో వాక్ టు పోలింగ్ బూత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏయే పోలింగ్ కేంద్రంలో గతంలో పోలింగ్ శాతం తక్కువగా నమోదైందో అక్కడికి అధికారులు వెళ్లి ఓటర్లతో మమేకమవుతున్నారు. ఓటు హక్కును తప్పకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. ఇటీవల 5కే రన్ వంటి కార్యక్రమాల ద్వారా ఓటర్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

మీటింగ్‌ల ద్వారా..

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అర్బన్ ప్రాంతాలు అత్యధికంగా ఉండటంతో వాటిపైన్నే అధికారులు దృష్టి సారించారు. ఇప్పటి వరకు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 15 సమావేశాల చొప్పున 75 స్వీప్ కార్యక్రమాలను చేపట్టారు. స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ఓటు ప్రాధాన్యంపై సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాలనీ అభివృద్ధి కమిటీలు, గ్రేటర్ కమ్యూనిటీ కాలనీ అసోసియేషన్లు, వెల్ఫేర్ అసోసియేషన్లు, అపార్టుమెంట్ కమిటీలు, సీనియర్ సిటిజన్లతో సమావేశాలు నిర్వహించి, ఓటింగ్ శాతం పెంపునకు చర్యలు తీసుకుంటున్నారు.

తప్పకుండా ఓటు వేయాలి

జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ సూచన మేరకు స్వీప్ కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడానికి స్వీప్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నాం. వయోజనులు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి.

– సాంబశివరావు
(డీఆర్డీఏ, స్వీప్ జిల్లా నోడల్ అధికారి)

5న కిరణ్ సంస్మరణ సభ



సంస్మరణ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటేష్‌గౌడ్

సుభాష్‌నగర్: ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ అకాల మరణం ఆటో డ్రైవర్లకు తీరని లోటని ఆ సంఘం కొంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు బైరి వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఈనెల 5న నగరంలోని సుందరయ్య కళా విజ్ఞాన కేంద్రంలో జరగనున్న కిరణ్ సంస్మరణ సభ పోస్టర్‌ను మంగళవారం దూలపల్లి ఆటో స్టాండ్ వద్ద వెంకటేష్‌గౌడ్ ఆటో డ్రైవర్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 5న ఉదయం 10 గంటల నుంచి జరుగనున్న సంస్మరణ సభకు ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖాజా, మధు, నారాయణ, జక్కరాజు, భాస్కర్ యాదవ్, ముజబిల్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



వేణుగోపాల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బైరి భాస్కర్‌గౌడ్

సుభాష్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు బైరి భాస్కర్‌గౌడ్ అన్నారు. ఇటీవల ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన హరకర వేణుగోపాల్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట సూరజ్ తివారి తదితరులు ఉన్నారు.

‘స్థానిక నాయకత్వంతో చర్చించకుండా పార్టీలో చేర్చుకోం’



ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు హన్మంతరెడ్డి, హరివర్ధన్‌రెడ్డి

నిజాంపేట్: స్థానిక నాయకత్వంతో చర్చించకుండా ఎవరిని పార్టీలో చేర్చుకోవడం జరగదని ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డిలు కుత్బుల్లాపూర్ నాయకులకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ నాయకుల చేరికల విషయాన్ని మంగళవారం వేం నరేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డిలతో చర్చించారు.

◆ ఈ సందర్భంగా పలు అంశాలను వారితో చర్చించిన వారు గతంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసిన ప్రజాప్రతినిధులే ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతుండటంతో ఇబ్బందులు ఎదురవుతాయని వివరించినట్లు తెలిసింది. అదే విధంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధుల చేరికల విషయాన్ని సైతం చర్చించారు. కొత్తవారు ఎవరు పార్టీలో చేరినా పాత నాయకులకు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఉంటుందని వేం నరేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డిలు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. పీసీసీ కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కొలను శ్రీనివాస్‌రెడ్డి, బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఉద్యోగాన్వేషణకు వెళ్లి.. యువకుడి అదృశ్యం



శ్రీసాయి ప్రణవ్ (ఫైల్)

సుభాష్‌నగర్: ఉద్యోగ అన్వేషణకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం మార్కెట్ రోడ్డులో ఉండే శ్రీకాంత్ బాబు పెద్ద కుమారుడు శ్రీసాయిప్రణవ్(25) ఈనెల 1వ తేదీన ఉదయం 11 గంటలకు ఉద్యోగాన్వేషణకు బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు చుట్టు పక్కల, స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మంగళవారం సూరారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సాయం



శ్రీనివాస్‌రెడ్డికి ఆర్థిక సాయం అందజేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి

సుభాష్‌నగర్: పేదలకు ఎస్వీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఎప్పుడు అండగా ఉంటుందని సంస్థ వ్యవస్థాపకుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సాంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గాజులరామారం ప్రాంతానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి పానీపూరి తయారీ పరిశ్రమంలో విధులు నిర్వర్తిస్తుండగా ప్రమాదవశాత్తు అతడి చేయి మెషిన్‌లో ఇరుక్కుపోవడంతో వైద్యులు చేతిని తొలగించారు. దీనిపై స్పందించిన పున్నారెడ్డి మంగళవారం బాధితుడు శ్రీనివాస్‌రెడ్డికి కృత్రిమ చేతిని అందించాలనే సదుద్దేశంతో తన వంతు సహాయంగా రూ.30వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హనస్, వెంకటస్వామి, వెంకటరామిరెడ్డి, బీఎల్ నాయుడు, రంజిత్‌సింగ్, సతీష్ తదితరులు ఉన్నారు.

మహిళల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం



కాంగ్రెస్ పార్టీలో చేరిన మహిళలతో కొలన్ హన్మంత్‌రెడ్డి

జీడిమెట్ల: మహిళల అభ్యున్నతి, సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలను హన్మంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి సుభాష్‌నగర్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో జరిగిన పార్టీ జాయినింగ్ కార్యక్రమానికి కొలన్ హన్మంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 50మంది మహిళలకు ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలకు పావలా వడ్డీ, వడ్డీ లేని రుణాలు పశువుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ హాయాంలోనే ప్రారంభించినవని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్‌లో చేరి పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన పదవులు ఇస్తామన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు నాగిళ్ల నరేందర్‌రెడ్డి, బొబ్బా రంగారావు, శోభా, నాగలక్ష్మి, శైలజ, రోజా, సంధ్యా, భాగ్య, వాణి, భాను తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

నిజాంపేట్: మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మంగళవారం నిజాంపేట్ కార్పొరేషన్ 24వ డివిజన్ బీఆర్ఎస్ కంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి ధనలక్ష్మి, నాయకురాలు విజయలక్ష్మిల ఆధ్వర్యంలో పలువురు మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి హన్మంతరెడ్డి, సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డిలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

సుభాష్‌నగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం సూరారం గ్రామానికి చెందిన బాలకృష్ణ (39) ఈనెల 1వ తేదీ ఉదయం స్కూటీపై కొమరవెల్లి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సూరారం శివాలయనగర్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో (టీఎస్08 ఎజె 2592) గల టాటా ఏసీ వాహనం స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలకృష్ణ కుడి కాలు నుజ్జు నుజ్జు కాగా పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడు మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో చెలరేగిన మంటలు

కాలిబూడిదైన విలువైన పత్రాలు, వస్తువులు



కుత్బుల్లాపూర్: ఓ ఇంట్లో మంటలు చెలరేగడంతో వస్తువులు, విలువైన ప్రతాలు కాలిబూడిదయ్యాయి. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల గ్రామంలోని గోల సమీపంలో నివాసముండే చిలుకూరి మంజుల ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు మంటలు వ్యాపించాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మంటలను గుర్తించి స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. అయితే ఇంట్లో వస్తువులు, విలువైన పత్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంపై అనుమానాలున్నాయని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛ భారత్‌లో సైంటిస్ట్‌లు



నిజాంపేట్: ప్రగతినగర్‌లోని ఇన్‌కాయిస్‌లో మంగళవారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌కాయిస్ ఆవరణలో పేరుకుపోయిన చెట్ల ఆకులు, చెత్తాచెదారాలను చీపుర్లతో శుభ్రం చేసి అనంతరం సంచుల్లో నింపి తరలించారు. ఈ కార్యక్రమంలో సైంటిస్ట్‌లు బాల కృష్ణన్, సుధీన్ జోసెఫ్, వెంకట శేషు, అడ్మిన్ అధికారులు నాగేశ్వరరావు, సుబ్రమ్మణ్యం, దేవేందర్‌కుమార్, ప్రసాద్, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్

రంగారెడ్డినగర్: ఇఫ్తార్ విందులు కులమతాల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన జామ మసీద్ మహమ్మదీయ మసీద్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక స్కైటన్ ఫంక్షన్‌హాల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయగా ప్రతాప్, యువసేస్తం అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఉపవాస దీక్షను విరమించిన ముస్లింలకు వారు పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో ఇఫ్తార్‌లకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. జామ మసీదు మహమ్మదీయ మసీదు అధ్యక్షుడు మహమ్మద్ ఖాజామియా, మహమ్మద్ సిరాజుద్దీన్, హమీద్ భాయ్, మహమ్మద్ పాషా, షేక్ బాబుమియా, తెలంగాణ గౌస్ భాయ్, అబ్దుల్ ఖాదర్, జలీల్‌ఖాన్, ఉస్మాన్, మహమ్మద్ రఫీఖ్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్‌లోని స్కైటాన్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ప్రార్థనలు చేస్తున్న ప్రతాప్

ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి



కుత్బుల్లాపూర్: ఆస్తి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. మున్సిపల్ వ్యాప్తంగా 15896 గృహ, వాణిజ్య నిర్మాణాలకు సంబంధించి మార్చి 31వ తేదీ నాటికి రూ. 9.46.71000 కోట్ల పన్నులు వసూలయ్యాయని పేర్కొన్నారు. పన్నులు చెల్లించకుండా బకాయి ఉన్న 107 మందిని గుర్తించి రెడ్ నోటీసులు అందించామని తెలిపారు. అదే విధంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నులు చెల్లించే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకం కింద 5శాతం రాయితీ కల్పిస్తోందని అన్నారు. ఈనెల 30వ తేదీ వరకు ఈ రాయితీ అందుబాటులో ఉంటుందన్నారు. ఎర్లీ బర్డ్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

నిజాంను గడగడలాడించిన ధీరుడు సర్వాయి పాపన్న



కుత్బుల్లాపూర్ గ్రామంలో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

కుత్బుల్లాపూర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా గౌడ సంఘం నేతలు నిర్వహించారు. కుత్బుల్లాపూర్ గ్రామంలో గౌడ సంఘం అధ్యక్షుడు కూన రాజకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాంను గడగడలాడించిన ధీరోత్తముడు పాపన్న అని కొనియాడారు. బడుగుల అభ్యున్నతికి కృషి చేసిన ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సందీప్, సుధాకర్, శ్రవణ్, రాముగౌడ్, ప్రభాకర్, భాను, శ్రీకాంత్, మహేష్, మధు, గణేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

3కిలోల గంజాయి పట్టివేత



నిందితుడు రమేష్ యాదవ్

జగద్గిరిగుట్ట: గంజాయి విక్రయిస్తూ ఓ వ్యక్తి పట్టుబడ్డ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేటు కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కట్టబోయిన రమేష్‌యాదవ్ కొంత కాలంగా గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. ఇతడు పాత నేరస్తుడు వడపర్తి కిరణ్ సహాయంతో ఈ గంజాయి వ్యాపారం కొనసాగాస్తున్నాడు. కాగా గత 3 రోజుల క్రితం తన యాక్టీవా బైక్ తీసుకొని భద్రాచలం వెళ్లాడు. అక్కడ కిరణ్ ఇచ్చిన 3కిలోల గంజాయిని హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టలో అమ్మడానికి పూనుకున్నారు. ఈ విషయం తెలిసిన ఎస్ఓటీ బాలానగర్ టీమ్ స్టేషన్ పరిధ/ లోని తులసీనగర్‌లో గంజాయి విక్రయిస్తుండగా రమేష్‌ను పట్టుకున్నారు. అతని వద్ద రూ.75వేలతో పాటు 3కిలోల గంజాయి, ఫోన్, బైక్‌ని స్వాధీనం చేసుకున్నారు. ఇతడికి సహాయపడ్డ వడపర్తి కిరణ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

కుత్బుల్లాపూర్: ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం గాజులరామారం డివిజన్ చంద్రగిరినగర్‌లో హైదరాబాద్ స్కూల్ ఆఫ్ సక్సెస్ యజమాని నవాబ్‌భాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం ఇఫ్తార్ విందును స్వీకరించారు. జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వేణుయాదవ్, బీఆర్ఎస్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, సాజిద్, చిన్న చౌదరి, సుంకరి చందు ముదిరాజ్ పాల్గొన్నారు.



చంద్రగిరినగర్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

ప్రమాదకర ప్రయాణం



సుభాష్‌నగర్: కొంపల్లి నుంచి దూలపల్లి మీదుగా బహదూర్‌పల్లి వెళ్లే రోడ్డులో ప్రయాణికుల అనుగుణంగా ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా పదుల సంఖ్యలలో ఇంజినీరింగ్ కళాశాలలో ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో సరిపడా బస్సు సర్వీసులు లేక విద్యార్థినులు ప్రమాదకరస్థాయిలో ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్నారు. మరికొంత మంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఉదయం సాయంత్రం వేళలో అదనంగా ఆర్టీసీ బస్సుల సర్వీసులను పెంచాలని పలువురు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరిస్తా

కుత్బుల్లాపూర్: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలో రోడ్లు ఛిద్రమయ్యాయని, తాగునీరు రావడం లేదని, డ్రైనేజీ పొంగిపొర్లుతోందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన రాజు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

జీడిమెట్ల సెక్షన్ ఇన్‌చార్జి మేనేజర్‌గా అనూష



బాధ్యతలు చేపట్టిన అనూషతో ఉద్యోగ విరమణ పొందిన రాజు

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీడిమెట్ల సెక్షన్ ఇన్‌చార్జి మేనేజర్‌గా సూరారం సెక్షన్ మేనేజర్ అనూష నియమితులయ్యారు. జీడిమెట్ల సెక్షన్‌లో పనిచేస్తున్న మేనేజర్ రాజు ఉద్యోగ విరమణ పొందడంతో సీజీఎం, జీఎం శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో అనుష మంగళవారం జీడిమెట్ల మేనేజర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు.